ప్రజాశక్తి
శుక్రవారం 5 ఏప్రిల్ 2024 5
శ్రీ సత్యసాయి

ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పెనుకొండ రూరల్

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అలా కాకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. గురువారం సాయంత్రం పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెనుకొండ-158 నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని తెలుసుకునేలా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ జరిగే ముందురోజు 12వ తేదీ ఉదయం 8 గంటలకు ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో అవసరమైన పోలింగ్ సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం జాగ్రత్తగా తీసుకుని పోలింగ్ విధులకు హాజరుకావాలన్నారు. పోలింగ్ ముగిసిన రోజు సాయంత్రం బాధ్యతగా ఈవీఎంలు, పీవో డైరీ ఇతర వాటిని రిసీవింగ్ సెంటర్ కు అప్పగించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళి సజావుగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ రోజు ఉదయం 5 గంటలకు పోలింగ్ ఏజెంట్ల నుంచి ఫారం-10 తీసుకుని వారిని లోక్‌సభ, అసెంబ్లీకి వేరువేరుగా ఏర్పాటు చేయాలన్నారు. అదే ఫారంలో అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్ సంతకాన్ని సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి ఒత్తిళ్లకు ఆందోళనకు గురికావద్దని, విధుల పట్ల చిత్తశుద్ధి కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 12వేల మంది దాకా ఎన్నికల సిబ్బంది విధులకు హాజరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఈవీఎంల పనితీరు అవగాహనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు శిక్షణలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం తహశీల్దార్లులు పీవోలు, ఏపీవోలు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్‌డిఒ

పుట్టపర్తి రూరల్ : సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులందరూ సమాయత్తం కావాలని ఆర్‌డిఒ భాగ్యరేఖ ఆదేశించారు. ఆర్‌డిఒ అధ్యక్షతన గురువారం పట్టణంలోని మంగళకర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో పిఒ, ఎపిఒ, సెక్టార్ అధికారులకు పోలింగ్ నిర్వహణ, ఈవిఎంల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మాక్‌పోల్, పోలింగ్, ఫారం భర్తీ చేయుట, సీలింగ్, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ ఏజెంట్స్ రిసెప్షన్ సెంటర్, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు అడిగిన సందేహాలకు మాస్టర్ ట్రైనర్లు ఫైజుల్లా, ఈశ్వరయ్య, జయరాములు, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి తహశీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎఒ ఎం.వెంకటస్వామి, కొత్తచెరువు తహశీల్దార్ కళావతి భారతి, వై.రామనాథరెడ్డి, ఖాజాబీ, నాగభూషణం, ఎన్నికల డిటి కె.నరసింహులు, డిటి మనోజ్‌కుమార్, స్వాతి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుతోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ప్రకటనతో వారంతా ప్రచారాల్లో మునిగిపోయారు. సుర్రున మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి మునుపే ఓ విడత ప్రచారాలు ముగించేయాలన్న భావనతో కాలికిబలపం కట్టుకుని తిరుగుతున్నారు. గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇదే సమయంలో అభ్యర్థులకు అసమ్మతి నేతల భయం పట్టుకుంది. ఒకటి రెండు మినహా మిగిలిన అన్ని చోట్లా ప్రధాన పార్టీలకు అసమ్మతి సెగ చుట్టుకుంది. దీంతో అభ్యర్థులు వారిని మచ్చిక చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు.

పగలు ప్రచారాలు.. రాత్రి బుజ్జగింపులు..!



- గెలుపు కోసం అభ్యర్థుల పాట్లు
- అసమ్మతి నేతలతో మంతనాలు
- కలిసి పనిచేసేలా రాయబారాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసింది. కాగా టిడిపి, వైసిపిలో అభ్యర్థుల ప్రకటన తర్వాత అసమ్మతి రాగాలు వినిపిస్తున్నాయి. ఇందులో కొన్ని బహిర్గతం అవుతుండగా మరికొన్ని లోలోపలే జరుగుతున్నాయి. రెండు, మూడు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని చోట్లా అసమ్మతి సెగలు ఉన్నాయి. టిడిపి విషయానికి వస్తే కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం అర్బన్, మడకశిర, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పరిస్థితి ఎక్కువగా ఉంది. శింగనమల, పెనుకొండ, నియోజకవర్గాల్లో అసమ్మతి ఉన్నా అధిష్టానం సూచనతో అవి సర్దుమనిగాయి. ఇక వైసిపిలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, కదిరి, పెనుకొండ నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఇప్పటికే రెండు పార్టీల నేతలు అటు నుంచి ఇటు పార్టీ కండవాలు మార్చేస్తున్నారు. ఇలాంటి సమయంలో అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలను చేస్తున్నారు.

ఉదయం ప్రచారాలు

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా అభ్యర్థులు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఉదయం 8గంటల కల్లా ప్రచారంలోకి దిగుతున్నారు. ఆయా ప్రాంతాల నేతలను వెంటబెట్టుకని అభ్యర్థులు ఓటర్లను కలుస్తున్నారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిసి ఓట్లు అడుగతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో సభలను నిర్వహించి వారి పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

అంతర్గత సమావేశాలు.. బుజ్జగింపులు..

ప్రచారంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో అసమ్మతి నేతలను కలిసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అధికారం వస్తే న్యాయం చేస్తామంటూ వారికి హామీనిచ్చి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను రాష్ట్ర నాయకులు పిలిచి మాట్లాడుతున్నారు. అలక వహించిన నేతల కోర్కెలన్నింటినీ తీరుస్తామనేలా అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. అందరినీ సమన్వయం చేస్తూ గెలావలనే భావనలో నాయకులు ఉన్నారు. అయితే కొన్ని చోట్ల అసమ్మతి నాయకులు దారికొస్తుండగా, మరికొన్ని చోట్ల సహకరించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. ఇలాంటి చోట అభ్యర్థులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ గ్రామం లేదా వార్డులో ప్రత్యర్థి పార్టీలో బలమైన నేతను తమ వైపునకు తిప్పుకునేలా పావులు కదుపుతున్నారు. ఇలా ఉదయం ప్రచారం రాత్రి బుజ్జగింపులతో ప్రచారాలు జరుగుతున్నాయి. నామినేషన్లు వేసేలోగా అసంతృప్తులను దారికి తెచ్చుకోవాలనేలా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకోవాలి

జెసి, ఆర్‌ఒ అభిషేక్ కుమార్

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జెసి అభిషేక్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్, హిందూపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్‌కుమార్ సూచించారు. పట్టణంలోని చిన్మయ విద్యాలయలో గురువారం లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన ఎన్నికల అధికారులు, సహ ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జెసి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు ఇస్మాయిల్, గణేష్, సురేష్, సునీల్ ఎన్నికల పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో తలెత్తే సాంకేతిక సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో హిందూపురం తహశీల్దార్ సిహెచ్ శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్‌ఐ బి.అమరేంద్ర, ఎన్నికల, రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది పాల్గొనారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

హిందూపురం పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను జెసి, ఆర్‌ఒ అభిషేక్ కుమార్ పరిశీలించారు. పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల శ్రీకంఠాపురం, మున్సిపల్ మినీ మార్కెట్ బిల్డింగ్, నానెప్పనగర్, సర్దార్ వల్లబాయి పటేల్ పాఠశాల, మోడల్ కాలనీ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా నీటి నిర్వహణ ఏజెన్సీ కార్యాలయం మీటింగ్ హాల్ రహమత్‌పురం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల చిన్న మార్కెట్ లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ర్యాంప్, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, డిఈఈ వాణి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఆర్‌ఐ అమరేంద్ర ఉన్నారు.

గాలికి కొట్టుకు పోయి విద్యుత్ తీగలపై పడిన ఎన్నికల తనిఖీ కేంద్రం

గాలికి కొట్టుకుపోయిన ఎన్నికల తనిఖీ కేంద్రం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిదిలోని 44వ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు ఆంధ్ర కర్నాటక సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రం సుడిగాలి దాటికి కొట్టుకుపోయింది. గాల్లో పైకి ఎగిరి విద్యుత్ తీగల స్తంబాలపై పడింది. ఆ సమయంలో తనిఖీ కేంద్రంలో తనిఖీలు చేసే పోలీసు సిబ్బంది, సాయుధ బలగాలకు చెందిన వారు ఉన్నారు. ఒక్క సారిగా గాలి రావడంతో చాకచక్యంగా టెంట్ కింద నుంచి వారు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. టెంట్ విద్యుత్ తీగలపై పడటంతో అప్రమత్తం అయిన అదికారులు విద్యుత్ శాఖకు తెలియజేసి కరెంట్ సరఫరాను నిలిపివేయించారు. ఎన్నికల తనిఖీ సిబ్బందికి నాణ్యమైన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అదికారులు విఫలం అయ్యారనేలా ఈ ఘటన చోటు చేసుకుంది.

వైసిపితోనే సంక్షేమ పాలన : ఉషశ్రీచరణ్

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి -పెనుకొండ రూరల్

రాష్ట్రంలో వైసిపి తోనే అభివృద్ధి, సంక్షేమ పాలన సాధ్యమని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ఆమె గురువారం నగర పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సునీల్, జయశంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, షేక్ షాబీనా, రఘునాథ్‌రెడ్డి, గణేష్, బోయ బాబు, సద్దాం, టౌన్ కన్వీనర్ నరసింహా, నాయకులు ఆంజనేయులు, కొండలరాయుడు, నిషార్, సిగ్బతుల్లా, శ్యామ్ నాయక్, మురళి, రహంతుల్లా, రాము, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పింఛను కోసం వెళ్లి

అస్వస్థతకు గురైన ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పింఛన్ కోసం వెళ్లి అస్వస్థతకు గురై ఇద్దరు వృద్ధులు గురువారం ఉదయం మృతి చెందారు. ఈ ఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఆయా కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రి మండలం చిన్నపడమల గ్రామానికి చెందిన ఆదెమ్మ(70) పింఛను తీసుకునేందుకు బుధవారం మధ్యాహ్నం సచివాలయానికి వెళ్లింది. అక్కడ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పింఛన్ కోసం వేచి చూసి అస్వస్థకు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆదెమ్మ మృతి చెందింది. తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన హుస్సేన్‌మియా(72) పింఛన్ కోసం బుధవారం ఉదయం సచివాలయం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వస్తుండగా ఎండవేడిమికి కళ్లు తిరిగి కింద పడ్డాడు. కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం ఆయన్ను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం హుస్సేన్‌మియా మరణించాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

కలెక్టర్ వినోద్‌కుమార్

ఎస్పీ అమిత్ బర్దార్

'అనంత' కలెక్టర్, ఎస్పీ నియామకం

- కలెక్టర్‌గా వినోద్‌కుమార్, ఎస్పీగా అమిత్ బర్దార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్‌గా డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీగా అమిత్ బర్దార్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం సాయంత్రమే జిల్లా ఎస్పీగా అమిత్ బర్దార్ బాధ్యతలు చేపట్టారు. వినోద్ కుమార్ శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతకు మునుపున్న కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌ను ఎన్నికల సంఘం బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ఇద్దరినీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాలయ్యా.. ప్రచారం ఏదయ్యా..!

బాలయ్య తరపున ప్రచారం చేస్తున్న టిడిపి స్థానిక నాయకులు

- 'పురం'లో కనిపించని నందమూరి బాలకృష్ణ
- ద్వితీయశ్రేణి నాయత్వంతోనే టిడిపి ప్రచారాలు
- బాలయ్య ప్రచారం చేయడా అంటూ ఓటర్ల ప్రశ్నలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గం టిడిపికి కంచుకోట. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ ఓటమన్నది లేకుండా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా నందమూరి కుటుంబ సభ్యులు ఇక్కడి నుంచి పోటీ చేసి గెలుపొంది అసెంబ్లీకి వెళ్లారు. టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు హిందూపురం నుంచి పోటీ చేసి ముఖ్యమంత్రి అయ్యాడు. ఆయన తర్వాత అతని కుమారుడు హరికృష్ణ కూడా ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచి గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ రెండు సార్లు గెలిచారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రం అంతా వైసిపి పవనాలు వీచినా హిందూపురం ప్రజలు మాత్రం బాలకృష్ణను గెలిపించారు. ఈసారి బాలకృష్ణ మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. అభ్యర్థి ప్రకటన అయితే జరిగింది గానీ ఆయన పురం ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. మిగితా నియోజకవ్గాల్లో టిడిపి అధిష్టానం అభ్యర్థులను ప్రకటించిన చోట ఓ విడత ప్రచారం ముగించేశారు. హిందూపురంలో మాత్రం ఇప్పటికీ టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులతోనే ప్రచారం చేస్తోంది. బాలకృష్ణ గానీ ఆయన కుటుంబ సభ్యులు గానీ ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు.

ద్వితీయశ్రేణి నాయత్వంతోనే టిడిపి ప్రచారం

టిడిపి హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం నందమూరి బాలకృష్ణను ప్రకటించింది. ఈ ప్రకటన చేసి దాదాపు నెల రోజులు కావస్తోంది. అయినా బాలకృష్ణ పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. ఇటీవల నారా లోకేష్ హిందూ పురంలో ఓ సభను ఏర్పాటు చేసి ఎన్నికలకు టిడిపి శ్రేణులను సన్నద్ధం చేసి వెళ్లారు. అది మినహా టిడిపి చెప్పకోదగ్గ పెద్ద కార్యక్రమం ఏదీ కూడా చేయలేదు. నారా లోకేష్ నిర్వహించిన కార్యక్రమంలో సైతం బాలకృష్ణ పాల్గొనలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాలకష్ణ, ఆయన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా నియోజకవర్గానికి రాకుండా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే వారు లేకపోవడంతో టిడిపి శ్రేణుల్లో నిస్తేజం కన్పిస్తోంది. ద్వితీయ శ్రేణి నాయకత్వం ప్రచారంలోకి వెళ్లిన సమయంలో బాలకృష్ణ ప్రచారానికి రాడా అంటూ ఓటర్ల ప్రశ్నించే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

వైసిపిలో చేరికలు

హిందూపురం టిడిపి నేతలు గత వారం రోజులుగా వైసిపిలోకి చేరుతున్నారు. చాలా కాలం పాటు టిడిపి కోసం పని చేసిన ముఖ్య నాయకులు సైతం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో టిడిపికి బలమైన ఓటు బ్యాంకు హిందూపురం పట్టణం, చిలమత్తూరు మండలంలో ఉంది. ఈ రెండు ప్రాంతాల నుంచే టిడిపి నుంచి వైసిపిలోకి వలసలు పెరిగాయి. చిలమత్తూరు మండలానికి చెందిన చంద్రదండు రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపిపి మరిది అన్సార్ అహ్మద్‌తో పాటు మరి కొంత మంది నాయకులు, లేపాక్షి మాజీ ఎంపిపి హనూక్‌లు ఇటీవల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి బలమైన ఓటు బ్యాంకు కలిగిన సామాజిక వర్గాల ముఖ్య నాయకులు వైసిపిలోకి చేరుతున్నారు. దీని ప్రభావం వచ్చే ఎన్నికల్లో టిడిపిపై ఉంటుందని ఆ పార్టీ నేతలే బలంగా చెప్పుకుంటున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా బాలకృష్ణ ఎన్నికల ప్రచారం చేయకపోవడంపై ఆ పార్టీ మద్దతుదారులే పెదవి విరుస్తున్నారు. హిందూపురం గెలుపుపై టిడిపికి అతివిశ్వాసం ఉందనే భావన టిడిపి మద్దతుదారుల నుంచి వ్యక్తం అవుతోంది.

ఎన్నికలు ప్రచారం చేస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్న వైసిపి అభ్యర్థి దీపిక

ప్రచారంలో వైసిపి...

హిందూపురం నియోజకవర్గంలో ఈసారి జరిగే ఎన్నికల్లో ఎలాగైనా వైసీపీ జెండా ఎగరవేయాలన్న లక్ష్యంతో ఆ పార్టీ అగ్ర నాయకత్వం మొత్తం పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం వైసిపి గెలుపు బాధ్యతను తీసుకుని గత నాలుగు నెలల నుంచి వివిధ రూపాల్లో వైసిపి శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేశారు. పెద్దిరెడ్డి సారథ్యంలో హిందూపురం వైసిపి అభ్యర్థి దీపిక ప్రచారంలో ముందుకెళ్తోంది. గత మూడు నెలలుగా ప్రజల మధ్యనే ఉంటూ ఆమె ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. దీపిక, ఆమె భర్త వేణురెడ్డి ఇద్దరూ ప్రతి రోజు షెడ్యూల్ రూపొందించుకుని చెరొక ప్రాంతంలో పర్యటిస్తున్నారు. వ్యక్తిగతంగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గతంలో హిందూపురం వైసిపిలో తీవ్ర వర్గ పోరు ఉండేది. ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో ఈ పరిస్థితి చాలా వరకు తగ్గింది. ముఖ్య నాయకులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్ తో పాటు నాయకులందరినీ కలుపుకుని దీపిక ప్రచారం చేస్తున్నారు. ఈసారి బాలకృష్ణను ఓడించి హిందూపురం రాజకీయ చరిత్రను మారుస్తామని వైసిపి శ్రేణులు ధీమాగా ఉన్నారు.

జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురు వారం కేంద్ర సాయుధ బలగాలతో పాటు స్థానిక పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అన్ని మండల కేంద్రాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా, పట్టణాల్లోకి ప్రవేశించే బోర్డర్ చెక్‌పోస్టులు, మార్గాల్లో తనిఖీలు చేపట్టారు. రహదారులు, ప్రధాన కూడళ్లలో వెళ్తున్న బస్సులు, లారీ లు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇలా ప్రతి వాహనాన్ని సోదా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తులపై నిఘా వేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ పరిశీలన

తనకల్లు : స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ స్టేషన్‌ను సందర్శించి భద్రతా చర్యలపై ఎస్ఐ ధరణిబాబు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.



తనకల్లు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కాంగ్రెస్ చేసిన అభివృద్ధే గెలుపునకు రక్ష

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి

ఎన్నికల ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తున్న రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని, వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి కోరారు. నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా గురువారం ఆయన మండలంలోని చందకచెర్ల గ్రామంలో ప్రచారం చేశారు. ముందుగా పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిం చారు. అనంతరం రఘువీరా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చేపట్టి అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేయడానికి, ఆర్. అనంతపురం సమీపంలోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ప్రతి గ్రామానికి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరందిస్తానన్నారు. వలస నివారణ చర్యలు చేపడుతామని, రైల్వే లైన్ పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని 340 గ్రామాల్లో ప్రచారం చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెటి.శ్రీధర్, కన్వీనర్లు మంజునాథ్, బాబు, గౌడప్ప, నాగరాజు, గురుమూర్తి, లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు భయపరెడ్డి, కాంట్రాక్టర్ ఈశ్వరప్ప, సురంగల నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : పల్లె

పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి- పుట్టపర్తి

టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. కొత్త చెరువులో గురువారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్, నెహ్రూ, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తలు బసవన్న కట్ట వీధి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 150 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరగా వారికి పల్లె పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లలో సిఎం జగన్ రూ. 13 లక్షల కోట్లు అప్పులు చేశారే కానీ అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. విద్యుత్, రవాణా ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారన్నారు. సకాలంలో బ్యాంకుల్లో డబ్బులు జమ చేయ కుండా పింఛన్ల పంపిణీలో కుట్ర పూరితంగా ఆలస్యం చేసి, ఆ నెపాన్ని టిడిపిపైకి నెట్టే ప్రయత్నాలు చేసిందన్నారు. ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే ఆయా సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాసులు, సామకోటి ఆదినారా యణ, లక్ష్మీనారా యణ, నాగేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, గాజుల చంద్రమోహన్, బోయ రాజు, రామ్మోహన్‌నాయుడు, కిరణ్, రాహుల్, వంశీకిషోర్, వై.విమురళి, సమ్మిటి చంద్ర, హరి, ఆర్.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే సైకిల్‌కు ఓటెయ్యండి

కందికుంట వెంకటప్రసాద్

వేపమానిపేట పంచాయతీలో ప్రచారం చేస్తున్న కందికుంట

ప్రజాశక్తి-తలుపుల

రాష్ట్రం బాగుండాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును సిఎం చేసుకోవాలని కదిరి నియో జకవర్గ టిడిపి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ కోరారు. కందికుంట గురువారం మండలంలోని వేపమానిపేట పంచాయతీలోని గుర్రం గుళ్లపల్లి, గుంజివారిపల్లి, హరిజనవాడ, కొత్తపూల వాండ్లపల్లి, జ్యోతివాండ్లపల్లి, జ్యోతివాండ్లపల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. పర్యటనలో కందికుంటకు ఆడపడుచులు హారతులు పట్టగా ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ భైరవ ప్రసాద్,జనసేన నాయకులు,కార్యకర్తలు తలుపుల మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనరు.

కూటమి నాయకులతో 'కందికంట' సమావేశం

గాండ్లపెంట : స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో కూటమి(టిడి, బిజెపి, జనసేన) నాయకులతో కందికుంట వెంకటప్రసాద్ సమావేశం నిర్వహించారు. కందికుంట మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమైందని విమర్శించారు. పింఛను సొమ్మును రూ. 200 నుంచి రూ. 2వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంస్థ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ సి.కొండయ్య, ఎ.వెంకటరమణారెడ్డి, డి.గంగరాజు, ప్రసాద్, డి.ఆనంద్, అక్రమబాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారు'

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైకాపా అభ్యర్థి ఈరలక్కప్ప

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా చేరినందుకు జనమంతా జగన్ వెంటే ఉన్నారని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆయన గురువారం పార్టీ నాయకులతో కలిసి గంగులవాయిపాళ్యం, గోవిందపురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే మడకశిర ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు చంద్రబాబు మాయమాటలు నమ్మరని రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, వైసి గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జిబి శివకుమార్, రంగేగౌడ్, వాగేష్, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, జడ్పిటిసి సరోజమ్మమూర్తి, నాయకులు సత్యనారాయణ, రవి, నారాయణస్వామి, కెపి. దివాకర్, నరేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మధు, పాల్గొన్నారు.

60 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలోని వంకరకుంట పంచాయతీలోని బసిరెడ్డిపల్లి, సానేవారిపల్లి, వంకరకుంట గ్రామా లకు చెందిన 60 కుటుంబాలు గురువారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. టిడిపి నాయకులు కేశవరెడ్డి, జయంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రమేష్, పవన్, నాగేశ్వరరావు, గంగులప్ప, తిరుమలేష్, సాకే నాగ రాజుతో పాటు పలువురు టిడిపిలో చేరగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి వారికి టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. అంతకుముందు వంకరకుంట పంచాయతీలో పల్లెకు అపూర్వ స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. పల్లె మాట్లాడుతూ ప్రజలు వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు కేశవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి సలాంఖాన్, అంబాసిఖాన్, పాపారాయుడు, రమణనాయుడు, నారాయణస్వామి, శివప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేష్, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ రోజును ఆన్ డ్యూటీగా పరిగణించాలి

కలెక్టరేట్ ఎఒకు యుటిఎఫ్ వినతి

ఎఒ రామంజనేయరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల విధుల్లో భాగంగా పిఒ, ఎపిఒలుగా శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు శిక్షణ రోజును ఆన్ డ్యూటీగా పరిగణించాలని యూటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురు వారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శెట్టిపి జయచంద్రరెడ్డి, సుధాకర్ కలెక్టరేట్‌లో ఎఒ రామాంజనేయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవా రాల్లో పిఒ, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణకు హాజరైన వారికి ఆన్ డ్యూటీగా పరిగణించాలే తప్ప కంపెన్సివ్ సెలవుగా పరిగణించరాదని డిమాండ్ చేశారు. ఎన్నికల శిక్షణ రోజుల ను మరొక సెలవు దినాల్లో పని చేయాలని అధికారులు చెప్పడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు.

టిడిపి హయాంలో బిసిలకు పెద్దపీట

ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్

ప్రజాశక్తి-మడకశిర

చంద్రబాబు హయాంలో బిసిలకు పెద్దపీట వేశారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. రొళ్ల పట్టణంలో గురువారం బిసి నాయకులతో కలిసి జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బిసిలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బిసి' కార్య క్రమం నిర్వహిస్తున్నామన్నారు. బిసి నాయకులు మాట్లాడుతూ టిడిపి వల్ల బిసిలకు ఎంతో న్యాయం జరిగిందని, టిడిపి అంటే బిసిలు.. బిసిలు అంటే టిడిపి అన్నారు. అందరం సమిష్టిగా పని చేసి సునీల్‌కుమార్‌ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించ గా, సిఎం జగన్ 34 శాతం ఉన్న రిజరేషన్లను 24 శాతానికి తగ్గించి బిసిలకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, పాండురం గప్ప, నరసింహామూర్తి, తిమ్మేగౌడ్, కుమారస్వామి, అశ్వత్థమప్ప, బొజ్జప్ప, సురేష్, వీరకేతప్ప, రామన్న, శివరుద్రప్ప, రాజన్న, ఈశ్వరప్ప, చిక్కన్న, నారాయణప్ప, రామచంద్రప్ప, రవికుమార్, రంగప్ప, సన్న మారేగౌడ, నాగలింగా చారి, లాయర్ రమేష్, నంజుండేగౌడ్, కిరణ్‌కుమార్, శ్రీరంగప్ప పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేయడానికి తనవంతుగా కషి చేస్తానని ఉమ్మడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని రోళ్ళ, హనుమంతనపల్లి, ఆవిరకుంట, వడ్రహట్టి, కొడకార్లగుట్ట తదితర గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్యలను తన వంతుగా పరిష్కరించడానికి కషి చేస్తానని తెలిపారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేస నీటి సమస్య తీర్చడానికి తన వంతుగా కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కుంచిటి ఒక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, కే ఎన్ పల్లి సురేష్, మారుతి ప్రసాద్, కుమారస్వామి, రామన్న, రవికుమార్ తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛను కోసం వృద్ధుల పడిగాపులు

పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-రొద్దం

పింఛను కోసం గురువారం కూడా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, తదితరులకు అవస్థలు తప్పలేదు. మండలంలోని పెద్ద కోడిపల్లి గ్రామంలో పెనుగొండ-పావగడ ప్రధాన రహదారి పక్కనే పాఠశాల వద్ద పింఛనుదారులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వేచి ఉన్నా అధికారులు వారివైపు కన్నెత్తి చూడలేదు. గ్రామస్తులు మధ్యాహ్నం 3 గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయగా అప్పుడు వచ్చి పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై పలువురు మండిపడ్డారు. మండలంలో వివిధ సచివాలయాల్లో ఆయా గ్రామాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బలో 87 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 10,090 పింఛనుదారులు ఉండగా 8,791 మందికి పంపిణీ చేసినట్లు ఎంపిఇఒ నాగ శేషాచలరెడ్డి తెలిపారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లి గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛను కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయ సిబ్బంది శ్రీలత గురువారం అక్కడికి చేరుకొని పింఛను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే పింఛనుదారులు ఒక్కసారిగా పోటీపడడంతో తోపులాట జరిగింది. దీంతో ఆమె అరకొరగా పంపిణీ చేసి మధ్యలోనే ఆపేసింది. సచివాలయం వద్దకు వచ్చి పింఛను తీసుకోవాలని సూచించింది. పింఛనుదారుల కోరిక మేరకు మరొక సచివాలయ ఉద్యోగిని అక్కడికి రప్పించి పింఛను పంపిణీ చేశారు.



రఘువీరారెడ్డిని కలిసిన నరసింహులు

రఘువీరాతో పెనుకొండ అభ్యర్థి భేటీ

గోరంట్ల : పెనుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరసింహప్ప గురువారం మడకశిర మండలంలోని నీలకంఠాపురంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డిని కలిసి సన్మానించారు. రఘువీరా మాట్లాడుతూ పెనుగొండ ఎమ్మెల్యేగా నరసింహులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నాయకులకు రఘువీరా సూచించారు. కార్యక్రమంలో కెటి.శ్రీధర్, గంగాధర్ పాల్గొన్నారు.

పింఛనుదారుల ఇబ్బందులకు చంద్రాబాబే కారణం : మక్బూల్

కదిరి టౌన్ : పింఛనుదారుల ఇబ్బందులకు ప్రధాన కారణం చంద్రబాబే అని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదల ఇంటి వద్దకే అందిస్తున్న వాలంటీర్లపై చంద్రబాబు కక్ష కట్టారని, దాంతో ఈ నెల పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగిందన్నారు. పట్టణంలో గురు వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పింఛను కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్న లబ్ధిదారుల కుటుం బాలకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబులో ఓటమి భయం మొదలైందన్నారు.

వసతి గృహం ప్రారంభం

మడకశిర : మండలంలోని హరేసముద్రం గ్రామంలో వెలసిన కొండ మహాలక్ష్మి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా విభూషిత జ్ఞాన తీర్థ సోమ మహా స్వామిజీ, పరమపూజ అష్టోత్తర శత శ్రీశంక రాత్మానంద సరస్వతి మహా స్వామీజీ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహానికి భూమి దానం చేసిన హనుమంతేగౌడ్‌ను ముఖ్య అతిథులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

వైసిపి నేత మృతికి ఎమ్మెల్యే సంతాపం

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువు మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు కేశవరెడ్డి అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలియడంతో ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి గాయత్రిరెడ్డప్పరెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచి నరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో పల్లె

పుట్టపర్తి : అల్లా దయ వల్ల మైనార్టీల అభివృద్ధికి పాటుపడ్డానని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త చెరువులో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం మత పెద్దలు, పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పల్లె సింధూర గెలుపు కోసం పని చేద్దామన్నారు. కార్యక్రమంలో మాణిక్యం బాబా, మహమ్మద్ రఫీ, అస్లాం, సయ్యద్,సైకిల్ షాప్ బాబా, షర్ఫుద్దీన్, సిమెంట్ మౌలా, షబ్బీర్, హిదయతుల్లా, బాషా పాల్గొన్నారు.

విచక్షణతో ఓటు వేయండి

పుట్టపర్తి అర్బన్ : ప్రజాస్వామ్య దేశంలో విచక్షణతో మంచి వ్యక్తికి ఓటు వేయాలని జిల్లా ఎన్నికల నిఘా వేదిక కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌నాయుడు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు మన తలరాతనే మారుస్తాయన్నారు. నేర చరిత్ర కలిగిన వారిని, అవినీతిపరులను ఓటుతో తిరస్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసి ప్రలోభ పెట్టాలని చూస్తారని వాటికి లొంగితే మనల్ని మనం అమ్ముకున్నట్లే అన్నారు. నిఘా నివేదిక తరఫున తాము కూడా నిఘా పెడతామన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులతో మాస్టర్ షాకీర్

బెల్ట్ టెస్ట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కరాటే బెల్ట్ టెస్ట్ పరీక్షల్లో విద్యార్థులు అర్హత సాధించినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హెచ్ఎం వెంకటాచలం, అఫిషియల్ ఎగ్జామినర్ ఎపి పోలీస్ అకాడమీ కరాటే కోచ్ వి.మురళీకృష్ణారెడ్డి హాజరై విద్యార్థులకు వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కరాటే వల్ల విద్యార్థుల్లో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మధైర్యం, శారీరక దృఢత్వం, మానసికోల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయని తెలిపారు. పరీక్షల్లో 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వారికి అతిథులు బెల్టులు, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు చాందిని, తదితరులు పాల్గొన్నారు.

11న సిపిఎం కొట్టాలలో డప్పుల పోటీలు

హిందూపురం : ఈ నెల 14వ తేదీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ డప్పుల పోటీలు నిర్వహిస్తునట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. ఆ కార్యక్రమానికి హాజరు కావాలని డిప్యూటీ తహశీల్దార్‌ను ఆహ్వానించారు. రమణ మాట్లాడుతూ ఈ నెల 11న రూరల్ మండలం మిల్లు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిపిఎం కొట్టాలలో డప్పు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి అంబేద్కర్ జయంతి రోజున బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 630 256 1949కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నారాయణ, వెంకటరమణ, కిష్టప్ప, గోవిందప్ప, నరసింహ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి సత్యకుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-బత్తలపల్లి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌యాదవ్ మొట్టమొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా గురువారం బత్తలపల్లి వద్ద కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మండల సరిహద్దులోని యర్రాయపల్లి వద్ద ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. యర్రాయపల్లి వద్ద నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ గజమాల వేశారు. ఓపెన్ టాప్ జీప్‌పై సత్యకుమార్ యాదవ్‌తో పాటు హిందూపురం టిడిపి ఎంపి అభ్యర్థి బికె పార్థసారథి, పరిటాల శ్రీరామ్ నిల్చొని శ్రేణులకు అభివాదం చేశారు. యర్రాయపల్లి నుంచి బత్తలపల్లికి వస్తుండగా మార్గమధ్యలో సంజీవపురంలో ముల్లగూరి వెంకట్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో స్వాగతం పలికారు. బిజెపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు కాన్వాయ్ వెంట కదిలారు. బత్తలపల్లి కూడలిలో నిరీక్షిస్తున్న వారికి అభివాదం చేస్తూ ర్యాలీ కొనసాగింది. కూడలిలో టిడిపి నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ర్యాలీగా ధర్మవరం వెళ్లారు.

యర్రాయపల్లి వద్ద అభివాదం చేస్తున్న సత్యకుమార్, పార్థసారథి, పరిటాల శ్రీరామ్

సవితమ్మ ముమ్మర ప్రచారం

గంగంపల్లి పంచాయతీలో ప్రచారం చేస్తున్న సవితమ్మ

ప్రజాశక్తి-గోరంట్ల

పెనుకొండ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సవితమ్మ గురువారం మండలంలోని గంగంపల్లి పంచాయతీలోని గోపిదేవర పల్లి, గంగంపల్లితండా, గంగంపల్లి గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ', మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో వైసిపి నాయకులు దోచుకోవ డమే కానీ ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని కోరారు. గ్రామ గ్రామాన ఆమెకు పూలమాలలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు వేణు, జయరాం, వెంకటరమణయాదవ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నరసింహులు, రామస్వామి, జనసేన పార్టీ నాయకులు సంతోష్, సురేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులతో వైసిపి చెలగాటం : టిడిపి

హిందూపురం : రాజకీయ లబ్ధి కోసం వైసిపి ప్రభుత్వం పేదలు, పింఛనుదారులతో చెలగాటం ఆడుతుందని టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం పింఛన్ల పంపిణీని టిడిపి అడ్డుకుందని వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేయడం అన్యాయమన్నారు. వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదని, రాజకీయా లకు వాలంటీర్లను వాడుకోవడాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. డెడ్ బాడీ రాజకీయాలు, కోడికత్తి నాటకాలు తరహా అసత్య ప్రచారాలు చేయడం జగన్‌కే చెల్లుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పింఛను రూ.4 వేలను ఇంటింటికీ వెళ్లి అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా : దీపిక

మలుగూరు పంచాయితీలో ప్రచారం చేస్తున్న దీపిక

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని వైసిపి అభ్యర్థి దీపిక హామీ ఇచ్చారు. ఆమె గురువారం రూరల్ మండలంలోని మలుగూరు గ్రామపంచాయతీ పరిధిలోని మలుగూరు, నందమూరినగర్, రంగపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వైసిపిని గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

చిలమత్తూరు : స్థానిక లక్ష్మీనరసింహస్వామి వీధిలో టిడిపికి చెందిన సుమారు వంద మైనారిటీ కుటుంబాలు గురువారం వైసిపి నాయకులు అన్సర్ అహ్మద్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక భర్త వేణు, అబ్దుల్ ఘనీ, ఎంపిపి పురుషోత్తమరెడ్డి వైసిపి కండువా వేసి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ టిడిపి బిజెపితో జత కట్టడంతో మైనారిటీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింద ని, దాంతో వైసిపిలో చేరినట్లు తెలిపారు. మైనారిటీల రక్షణ వైసిపితో సాధ్యమన్న భరోసాతో అన్సర్ అహ్మద్ సూచన మేరకు వైసిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, హనుమంతరెడ్డి, షాకీర్, రహంతుల్లా, నయాం పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన మైనారిటీలు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం : పట్టణంలోని ఎంజిఎం పాఠశాల మైదానం సమీపంలో గురువారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ మాట్లాడుతూ హిందూపురం రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఎంజిఎం మైదానం సమీపంలో గుర్తు తెలియని మగ వ్యక్తి (వయస్సు 40-45) మృతి చెందాడన్నారు. ఛామన ఛాయ రంగు కలిగి 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. అతడు రైలులో ప్రయాణిస్తూ కింద పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే హిందూపురం రైల్వే పోలీస్ వారికి 94406 27641, 94412 38182 ,08556 220697నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి...

నల్లచెరువు : మండలంలోని ఎర్రగుంటపల్లి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తనకల్లు మండలంలోని రాకుంటపల్లి గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి చిన్న వెంకటరమణ(57) మృతి చెందాడు. అతడు బైక్‌పై తనకల్లు వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గోరంట్లలో మూడు చోరీలు

గోరంట్ల రూరల్ : గోరంట్ల పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతు న్నారు. బుధవారం రాత్రి మూడు ప్రాంతాల్లో చోరీలు జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బాలికల హైస్కూల్ వెనుక వీధిలో నివాసం ఉంటున్న శివ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంచేవాడు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి ఇంటి ముందు ఎపి-02 టిఈ 1596 నంబర్ గల అప్పి ప్యాసింజర్ ఆటోను ఆపి ఉండగా తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని బూడిదదిన్నె ప్రాంతంలో నేత కార్మికుడు వేణుగోపాల్ ఉక్కపోతకు తట్టుకోలేక ఇంటికి తాళం వేసి మిద్దెపై భార్యా పిల్లలతో నిద్రిస్తుండగా ఇంటి తాళం పగలగొట్టి లోపలి ప్రవేశించి రూ. 2 లక్షల నగదు, నెక్లెస్, 5 ఉంగరాలు ఎత్తుకెళ్లారు. పంచాయతీ వాటర్ మెన్ జయచంద్ర ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లగా తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి రూ. 40 వేల నగదు, 25 గ్రాముల నెక్లెస్, కమ్మలు, వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. ఆయా ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ఆవులు అపహరణ

రొద్దం : మండలంలోని చోలేమర్రి గ్రామానికి చెందిన జిఆర్.అంజి, జిహెచ్.మల్లికార్జునకు చెందిన రెండు ఆవులను మూడు రోజుల గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఒక ఆవు రూ. 80వేలు, మరో ఆవు రూ. 20వేలు విలువ చేస్తాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పుట్టపర్తి : కొత్తచెరువులోని బిసి కాలనీకి చెందిన హాసిని గురువారం అనారోగ్యంతో మతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించడా నికి ఎవరూ లేకపోవడంతో ఆ కాలనీ యువకులు పుట్టపర్తికి చెందిన కతమత్ ఏ కల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శామీర్‌కు సమాచారం ఇచ్చారు. వారు గ్రామానికి వచ్చి హాసిని మృతదేహాన్ని వైకుంఠ రథం ద్వారా శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో షాకీర్, సాందు, సాయి, మాతాంగి షమీవుల్లా, సాహిత్, బాలాజీ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.